# 13. అప్పొద్దు... ఆస్తి కావాలి

"ఎంతపని చేశావురో దేవుడో... ఓర్నీ పాడేగట్ట... నీ దెవసం జెయ్యా... నీకేం పోయేకాలమొచ్చిందిరో..." అంటూ పెద్దగా ఏడుస్తూ... అరుస్తూ... ఒక్క ఉదుటున లేచి కొడుకు సింగయ్య చేతిలో ఉన్న కర్రను లాగేసుకుంది సుబ్బులు.

సింగయ్య కర్రతో కొట్టిన దెబ్బకి సోమయ్యకి తలచిట్లింది. రక్తం ధారాపాతంగా కారుతోంది.

"కనిపెంచిన నేరానికి ఎంతపని చేశావురా... నీకిదేం పోయే కాలం రా...? అబ్బ తల పగలకొడతావంట్రా సచ్చినోడా...?" కారుతున్న రక్తాన్ని పమిట చెంగుతో తుడుస్తూ అంది సుబ్బులు.

అప్పటికే ఇరుగుపొరుగు జనం చాలా మంది చేరారు.

"ఎంత పని చేశావురా సింగాయ్? తండ్రిని పట్టుకుని అంత దెబ్బ కొడతావంట్రా? తల పగిలి చూడు ఎంత నెత్తురు కారతందో..! మడిసిని మించిన కోపమెందుకు వచ్చిద్దిరా?" పక్కింటి నారాయణ కోపంగా అన్నాడు.

"లేకపోతే ఏంది బాబాయ్? ఎంతసేపటికీ ఆయన మాటే చెల్లాలంటే ఎట్ట? నేను కాబట్టి ఇంతటితో పోనిచ్చా? ఇంకొకడైతే చంపవతల పారేసేవాడు"

"ఇప్పుడేమైందిరా? చంపూ... నీకే అడ్డూ ఉండదు" నెత్తురుకు చేయడ్డం పెట్టుకుంటూ అన్నాడు సోమయ్య.

“నువ్వూరుకోవయ్యా. మాట్టాడవాకు. లేనిపోని గొడవెందుకు?” అంది సుబ్బులు.

పక్కనే ఉన్న బ్యారన్ దగ్గరకు కూలికెళ్తున్న సింగయ్య భార్య భారతికి ఈ గొడవ తెలిసింది. పరిగెత్తుకుంటూ అక్కడికొచ్చింది. ఒక వైపు భర్త సింగయ్య రొప్పుతూ, కోపంగా అరుస్తూ నిలబడి ఉన్నాడు. మరోవైపు మామ నెత్తురోడుతూ... పరిస్థితినర్థం చేసుకుంది ఆమె.

“మంచిపనే చేసావు గానీ... ఇంక పో లోపలికి” భర్తని అక్కడ నుంచి పక్కకు తీసుకుపోవడానికి ప్రయత్నించింది ఆమె.

“ఛ... పో అవతలికి. నువ్వుగనీ నోరెత్తావంటే... పళ్లురాలి పోయినయ్యే?” తన కోపాన్ని భార్యమీద చూపించాడు సింగయ్య. ఊళ్ళో ఇరుగు పొరుగు చేరి సోమయ్యని ఆసుపత్రికి తీసుకెళ్లారు. కొంతసేపటికి సింగయ్య కోపం చల్లారింది. “అనవసరంగా తొందరపడ్డానా?”అని రెండు మూడు సార్లను కున్నాడు. “ఎంకా ఇంత మాత్రం పడాల్సిందే” అని తనని తనే సమాధాన పరుచుకున్నాడు.

సోమయ్య మూడెకరాల రైతు. వ్యవసాయం కలిసి రాక... అప్పులు చేశాడు.

ఆస్థి మొత్తం అమ్మినా అప్పులు తీరని పరిస్థితి. చేసేదేం లేక పొలం అమ్మాలని ఆలోచన చేశాడు. ఆమాటే కొడుకుతో అన్నాడు.

“పొలం మొత్తం ఎట్టా అమ్ముతావు నాయనా? నా భాగం నాకుపంచి తరువాత నీ తంటాలేవో నువ్వు పడు” అన్నాడు కొడుకు.

“ఒరేయ్... తండ్రి ఆస్తిలోనే కాదురా బిడ్డ భాగం పంచుకోవాల్సింది. అప్పుల్లోనూ భాగం పంచుకోవాలి.”

“నిన్నుఅసలు బాకీలెవడు చేయమన్నాడు. చేసేటప్పుడు తీర్చాలని తెలీదా? నీ బాకీలతో నాకేంసబంధం లేదు. నువ్వు సంపాదించి కుప్పలు పోసిన ఆస్థి నాకేం ఇయ్యొద్దు. మా తాత సంపాదించిన పొలంలోనే నాకు భాగం పెట్టు. తండ్రి స్వార్జితంలో కొడుక్కు హక్కు లేకపోయినా తాత ఆస్థిలో ఉంటుంది కదా” అన్నాడు సింగయ్య.

పొలం విషయంలో, అప్పు విషయంతో ఈ తగాదా మూడు నెలలుగా అబ్బా కొడుకుల మధ్య జరుగుతోంది. పొలంలో కలిసి రాకపోవడం, అప్పులు పెరగడంతో పాటే తండ్రీ కొడుకుల మధ్య తగాదాలు పెరుగుతున్నాయి. ఒకరు ఎడ్డెం అంటే... మరొకరు తెడ్డెం అనుకోవడం మొదలైంది.

సింగయ్య ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో పూరిపాక వేసుకున్నాడు. భార్యతో కలిసి వేరుకాపురం పెట్టాడు.

బాకీల వాళ్ల ఒత్తిడి ఎక్కువైంది. దాంతో సోమయ్య పొలం బేరం పెట్టాడు. సింగయ్య ఒప్పుకోలేదు. మాటా మాటా పెరిగింది. కోపం పట్టలేక సింగయ్య తండ్రిని కర్రతో కొట్టడంతో తల చిట్లింది.

వారం రోజుల తరువాత వాళ్ల సమస్యను పరిష్కరించడానికి పెద్దమనుషులొచ్చారు.

"లక్షా ఎనభై వేలయిందిరా సింగయ్యా మొత్తం బాకీ. మీ పొలం ఎకరం యాభైవేలకంటే ఎక్కువ చేయదు. పొలమంతా అమ్మినా బాకీలు పూర్తిగా తీరేట్టు లేవు. ఏం చేద్దాం" ఒక పెద్దమనిషి అడిగాడు.

"నేను కాదు గదా బాకీలు చేసింది. నా భాగం పొలం పంచి ఇచ్చి మీరే చేయండి బాబాయ్ ఎలాగో" అన్నాడు సింగయ్య.

ఎవరెన్ని చెప్పినా సింగయ్య తన పట్టు సడలించుకోలేదు.

కుటుంబ బంధాల్లో మానవీయసంబంధాల పట్టుకంటే డబ్బు పట్టు అంతగట్టిది మరి!

"సింగయ్య మాటల్లోనూ ధర్మముంది. ఈ అప్పు నిజానికి అతను చేసింది కాదు. సోమయ్య భాగం పొలాన్ని అమ్ముకుని వచ్చిన డబ్బు సరిసమానంగా భాగాలు చేసి అప్పులవాళ్లంతా పంచుకోండి" అని పెద్దమనుషులు తీర్పు చెప్పారు.

చేసేదేమీ లేక అప్పుల వాళ్లు తప్పనిసరై తలొంచారు .

తలొంచుకు నిలబడ్డ తండ్రి నెత్తిన పడిన నాలుగు కుట్లు అందరికీ కనబడుతున్నాయి. కుటుంబ సంబంధాల్లోని పగుళ్లు ఎవరికీ కనబడ్డం లేదు. వాటికి ఏ కుట్లు వేయాలి? ఎవరు వేయాలి?

స్నేహ ప్రజాశక్తి ఆదివారం - 02 అక్టోబర్, 2005